పాత్రికేయులకు ప్రశంసలు

విశాలాంధ్ర-పులివెందుల: విశాలాంధ్ర దిన పత్రిక పులివెందుల, వేంపల్లె పాత్రికేయులు రమేష్‌బాబు, అమర్‌నాథ్‌రెడ్డిలకు ప్రశంసలు లభించాయి. ఆ మేరకు కడప నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన నెలవారి సమావేశంలో వారిని ఘనంగా సన్మానించారు. 2023 నూతన సంవత్సరం కేలండరు ప్రకటనలలో వారితో పాటు మరికొంత మంది పాత్రికేయులు విశేష ప్రతిభ చూపారు. ఈ దఫా కూడా పాత్రికేయులు యాడ్స్‌లో మంచి ఫలితాలను అందించారు. దీంతో ప్రకటనలకు సహకరించిన వారందరికీ ఘనసత్కారం లభించింది. ప్రకటనలే కాకుండా తాజా సమాచారం, వివిధ రంగాలపై విభిన్న దోరణిలో వార్తాకథనాలు అందించారు. మున్ముందు కూడా పాత్రికేయులందరూ విశాలాంధ్ర దినపత్రికకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని తిరుపతి ఎడిషన్ బ్రాంచి మేనేజరు సుబ్బరాయుడు, బ్యూరో ఇన్‌చార్జి రామసుబ్బారెడ్డిలు కోరారు.

పక్కాగా టీబీ నిర్ధారణ సర్వే

అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.ఖాదర్‌వల్లి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల ప్రాంతంలో పక్కాగా టీబీ నిర్ధారణ సర్వే నిర్వహించడం ద్వారా నిజమైన రోగులను గుర్తించాలని అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి సూచించారు. పట్టణంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన హెచ్‌ఓడి డాక్టర్ గోపీకృష్ణ, జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నాగేంద్రకుమార్‌తో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఇంతవరకు 922 గృహాలను సర్వే చేయగా నూతనంగా ఒక్క పాజిటివ్ కేసు నమోదైనట్లు టీమ్ సభ్యులు అధికారులకు వివరించారు. గత 5 సంవత్సరాల నుండి ఇప్పటి వరకు ఎన్ని టీబీ కేసులు నమోదైనవో తెలుసుకునేందుకు ఈ సర్వే చేపట్టడం జరుగుతోందని అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వల్లి వివరించారు. ఇప్పటి వరకు ఎర్రగుంట్లలో 38 కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. సర్వే నిర్వహణలో అలసత్వం లేకుండా పక్కాగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్న, సూపర్‌వైజర్ ఓబులేసు, టీబీ సూపర్‌వైజర్ సునీల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ఫాజుల్ రెహమాన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫుల్ అడిషనల్ ఛార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆచార్య పి.ఫాజుల్ రెహమాన్ గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వ విద్యాలయం కార్య నిర్వాహక మండలి సమావేశం ఉండడంతో కడపకి రాలేనందున ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సెక్రటరీ నజీర్ అహ్మద్ కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించినట్లు రిజిస్ట్రర్ ప్రొఫెసర్ ఈ.సీ.సురేంద్ర నాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సెక్రటరీ నజీర్ అహ్మద్, డాక్టర్ వైఎస్ఆర్ ఏఫ్‌యూ రిజిస్ట్రర్ ప్రొఫెసర్ ఈ.సీ.సురేంద్రనాథ్ రెడ్డి, రిజిస్ట్రర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వ విద్యాలయం రిజిస్ట్రర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, వైఎస్ఆర్ ఏఫ్‌యూ సూపరింటెండెంట్ వై.పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఖండిత కందకాల పనుల పరిశీలన

విశాలాంధ్ర-వేముల: వేముల పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న ఖండిత కందకాల పనులను డ్వామా పీడీ యధుభూషణంరెడ్డి, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డిలు బుధవారం పరిశీలించారు. పనులను పర్యవేక్షించడంతో పాటు కూలి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నా రు. పనుల నిర్మాణం నాణ్యతగా ఉండాలని వారు వివరించారు. అక్కడ చేపట్టిన ఖండిత కందకాల పనుల పట్ల వారు సంతృప్తిని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు: ఎంఈఓ

విశాలాంధ్ర-వేంపల్లె: పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని వేంపల్లి మండల విద్యాశాఖ అధికారి బండి వీరారెడ్డి అన్నారు. స్థానిక ఉషా కిరణ్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను మాట్లాడుతూ పండుగలు నిర్వహించుకోవడం ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోగలమన్నారు. అన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పిల్లలకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నందుకు కరస్పాం డెంట్ బిఎస్ రమణారెడ్డిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ పండుగలను పాఠశాల లో నిర్వహించడం ద్వారా దైనందిన జీవితంలో వాటి ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేసే సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని విజయనగరం వీధిలో ఉండే శివుడు అనే దివ్యాంగునికి ఆల్ ఆఫ్ యూ దివ్యాం గుల మరియు వయోవృద్ధుల సేవా రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివునికి వైద్యులు పరీక్షించి కాలు తీసివేయడం జరిగిందని, అనారోగ్యంతో ఇంటి నుండి బయటికి రాని దీన స్థితిలో ఉన్న శివుడు అనే దివ్యాంగునికి బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు అందచేయడం ఆనందదాయకం అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న దివ్యాంగులకు ఆహారం కొరకు, దివ్యాంగ పిల్లల చదువుకొరకు, మందులు కొనడానికి ఆర్థికంగా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న వారికి ఎల్లవేళలా సహాయం చేయడానికి ఆల్‌ఆఫ్ యూ దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సేవాసొసైటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన దాతలు పల్లా నారాయ ణ, పల్లా ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చలపతిరావు, ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకు పాల్పడ్డ సూపర్‌వైజర్, ఆయాలను సస్పెండ్ చేయాలి:ఏఐటీయుసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్టులోని చెన్నూరు సెక్టార్ ఆరో వార్డులో అంగన్వాడీ వర్కర్‌గా సంధ్యారాణి పనిచేస్తూ ఇటీవల ఆత్మ హత్యకు కారకులు చెన్నూరు సూపర్వైజర్ గురమ్మ, ఆయాగా పనిచేస్తున్న జ్యోతిలను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఐసీడీఎస్ అధికారులతో కాకుండా రహస్య విచారణ జరిపించాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజుకి ఐసిడిఎస్ పిడి రాణికి ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, ఇన్సాఫ్ నగర కార్యదర్శి మైనుద్దీన్‌లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల పైన ఎటువంటి పర్యవేక్షణ చేయకుండా సిడిపిఓ ఆఫీస్‌లో కూర్చొని కిందిస్థాయి ఉద్యోగులపై సమాచారం సేకరించడంతో పాటు అంగన్వాడీ వర్కర్ల పైన అనేక విధాలుగా ఒత్తిళ్లు తీసుకొస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రహస్య విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. స్కూల్లో పిల్లలు లేరు కాబట్టి రూరల్ ప్రాజెక్టులోని చింతకొమ్మదిన్నె ఆజాద్ నగర్‌కు సెంటర్‌ను షిఫ్ట్ చేస్తున్నామని చెబుతూ షిఫ్ట్ కావడానికి సంధ్యారాణితో పాటు మరో అంగన్వాడి వర్కర్ సిద్ధపడ్డ ఆర్డర్స్ ఇవ్వడానికి నెలల తరబడి కాలయాపన చేయడం జరిగిందన్నారు. అనేకమార్లు ఆజాద్ నగర్‌కు సెంటర్‌ను షిఫ్ట్ చేయమని బ్రతిమిలాడిన సెంటర్ స్విఫ్ట్ చేయడంలో కాలయాపన చేశారని సంధ్యారాణి మరణించిన తర్వాత ఆగమేఘాలపై ఆజాద్ నగర్‌కు సెంటర్ మార్చడం ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు అక్రమ అరెస్టు తగదు : టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డ గుర్రప్ప, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గొడుగునూరు రాజశేఖర్, టిడిపి ఎస్సీ నాయకులు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కావలిలో దళితులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా ఛలో కావలి కార్యక్ర మాన్ని పోలీసుల అడ్డుకొని ఎమ్మెస్ రాజుని అక్రమంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండించారు. ఈ ప్రభుత్వం ఆయనకు ఎలాంటి ఇబ్బందులు కలగజేసిన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కడప తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పోలీసులను వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, కమలాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుల్లగూర శ్రీనివాసులు మాట్లాడుతూ దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని, దళితులపై జరుగుతున్న దాడులను బాధిత దళిత కుటుంబాలను ప్రజా క్షేత్రంలో ప్రశ్నించ డానికి వెళ్తున్న మా ఎస్సీ నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని కారకులైన పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాలు శాశ్వతం కాదని ప్రజా వ్యవస్థలు శాశ్వతం అని పోలీసులు గుర్తు పెట్టుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, టిఎస్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాధ్ పాల్గొన్నారు.

ఇస్లాం షరియత్ పై దుష్ప్రచారం తగదు

విశాలాంధ్ర-బద్వేల్ : ఇస్లాం షరియత్ పైప మాత్రం అవగాహన లేకుండా దుష్ప్రచారం చేయడం తగదని షరియత్ అవగాహన కమిటి బాధ్యులుతెలిపారు. ఆల్‌ఇండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలోబుధవారంపట్టణంలోని ఫాతిమ మశీదు మైదానంలో స్థానిక ముస్లిమ్ మహిళలకుషరియత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పురస్కరించుకుని షరియత్ అవగాహన కమిటి బాధ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతుఇస్లాం షరియత్ అత్యున్నత మైనదని ఇందులో మహిళల రక్షణకు అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. ఇస్లాం లోతలాక్ చెప్పినంత మాత్రానే విడాకులవుతాయన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. భార్యాభర్తల పర్సస్పర అంగీకారం మేరకే తలాక్ ద్వారావిడాకు లు మంజూరవుతాయన్నారు. తలాక్ అంటూ ఏకబిగిన మూడుసార్లు చెప్పినంత మాత్రాన తలాక్ చెల్లుబాటు కాదన్నారు. ఇస్లాం షరియత్ గురించి అవగాహన లేకుండా దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ జలీసా సుల్తాన యాసిన్(అడ్వకేట్),డాక్టర్ ఖుద్దూస సుల్తాన, డాక్టర్ జోహర్ జహాన్, ముఫీజ హాఫీజ సాహెబా లతో పాటు మాస్ కమిటి, బద్వేలు ఉలమ ఏ అయ్యుమ్మ కమిటి, స్థానికపండితులుపాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ రూ.600లు ఇవ్వాలి

విశాలాంధ్ర - కమలాపురం : కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు పేరుతో ఉపాధి కూలీల నోట్లో మట్టి, ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు పని రోజులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగడపూల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధి హామీ ఏపీవో కార్యాలయం లోని బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ శైలజకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెరిగిన ధరలకనుకూలంగా రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలి. ఉపాధి కూలీలకు వంద రోజులు పని దినాలు పూర్తి అయి పనులు లేక జిల్లాల నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి బడ్జెట్లో ఉపాధి హామీకి రెండు లక్షల 40 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కూలీలు పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు గడ్డపారలు, మెడికల్ కిట్లు,ఎండ వేడిమికి తట్టుకోవడానికి బట్టలు ఆయాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి జి. నాగేశ్వరరావు, నాయకులు రాయప్ప,యస్. సుబ్బరాయుడు, పి. గంగాధర్, గంగయ్య, కదిరయ్య, నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలో మరొక రెండు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రూ.163కోట్ల తో మురుగునీరు కాలువల ఆధునీకరణ, ఏళ్ల తరబడి మురికిగా ఉండటంతో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రూ.163కోట్ల తో 70కిలోమీటర్ల మేర ఇంటర్నల్ కాలువలు మరియు 5.2కిలోమీటర్ల మేర పెద్ద కాలువలు ఆధునీకరణలో భాగంగా జీఓ దగ్గరి నుండి టెక్నికల్ శాంక్షన్ నుండి టెండర్ దశ కూడ పూర్తి అయిందని అన్నారు. ఈ రెండు పనులను కె.వి.ఆర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అనే గుత్తేదారు సంస్థ దక్కించుకుందని తెలిపారు. ఫిబ్రవరిలో వీటికి సంబంధించిన భూమిపూజ పనులు కూడ జరుగుతాయని అన్నారు.

ఒడ్డె ఓబన్న బలిదానం చరిత్రలో లిఖించాలి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: సంచార జాతుల నుండి వచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడు "ఒడ్డె ఓబన్న" త్యాగం, బలిదానం ప్రపంచ చరిత్రలో సువర్ణాక్ష రాలతో లిఖించాలని వడ్డెర సంక్షేమ నాయకులు అన్నారు. స్థానిక పులివెందుల పట్టణ పరిధిలోని పులివెందుల నియోజకవర్గం వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడుల చలపతి ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మెదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిత్రపటానికి పులాభిషేకం నిర్వహించి పుష్పాంజలులు అర్పించారు. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ వారిని ఎదిరించి వీరోచితంగా పోరాడి ఆనాటి ప్రజలను చైతన్యం చేసిన గొప్ప మహనీయులు వడ్డెర ఓబన్న అని కొనియాడారు. వడ్డెర ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టుదలతో ఐకమత్యంతో సమాజంలో అభివృద్ధి వైపు నడవాలని పిలుపునిచ్చారు. పట్టుదల, నమ్మకం, నాయకత్వం, సమాజంలో మంచి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గండి ఆంజనేయులు, చిన్న కొండయ్య నాగేష్ శీను పెద్దబ్బి నారాయణ స్వామి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నలంద పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-సిద్దవటం : స్థానిక శ్రీ నలంద పాఠశాలలో ఎంఈఓ శంకర య్య ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాం తి సంబరాలను నిర్వహిం చారు. ముందస్తు సంబరాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగవల్లుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం మండల విద్యాధికారి చేతులమీదుగా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఎంతో క్రమ శిక్షణగా సంక్రాంతి సంబరాలను విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల సమక్షంలో జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు బీన, గాగేశ్వరి, శోభారాణి, వెంకట సుబ్బమ్మ, కరీమున్నిసా, నారాయణమ్మ, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధి లోని తోట్లపల్లె పంచాయతీలోని సచివాల యం పరిధిలోని గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని తమ ప్రభుత్వమే ధ్యేయంగా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఆ గ్రామ సమస్యలు, గ్రామాల అభివృద్ధి పైన గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమం ద్వారా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, స్థానిక సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, ఎంపీటీసీ సభ్యులు రామసుబ్బమ్మ, జడ్పీటీసీ ముత్యాల రామ గోవిందారెడ్డి, మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డిలు కలిసి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి వాలంటీర్ల ద్వారా అందచేస్తున్నామని పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబా నికి అందిస్తున్నామని అన్నారు. ఎక్కడికి వెళ్లిన ప్రజలు నీరాజనం పలుకుతు న్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో మళ్లి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ చైర్మెన్ సుబ్బారెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి, ఇంచార్జ్ తహసీల్దార్ రమేష్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రతాప్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, వెలుగు ఏపీఎం ప్రకాష్‌రావు, ఉపాధి ఏపీఓ వసంతకుమార్, సర్పంచ్ రామయ్య, వైకాపా నాయకులు చిన్న వెంకటసుబ్బారెడ్డి, బాలయ్య, సచివాలయం కన్వీనర్లు జోగయ్య, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్: కడప కె.ఓ.ఆర్.యం. క్రికెట్ గ్రౌండ్ లో జమీల్ ఛాంపియన్స్ ట్రోఫీ 2023 ఫైనల్ మ్యాచ్ బుధవారం నిర్వహిం చడం జరిగింది,అనంతరం మ్యాచ్ ప్రెజంటేషన్ సెరెమోనీ కె.ఓ.ఆర్. యం.గ్రౌండ్లో నిర్వహించడం జరిగింది. జమీల్ చంపియోన్స్ ట్రోఫీ 2023 ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిధిగా టీ.డీ.పీ నాయకుడు హరి ప్రసాద్ గారు పాల్గొన్నారు.అనంతరం హరి ప్రసాద్ మాట్లాడుతూ లీగ్ నిర్వహించిన జమీల్, వారి మిత్ర బృందాన్ని అభినందించారు. అలాగే స్పాన్సర్లుగా వ్యవహరించిన జమీల్ మొబైల్స్ యాజమాన్యం క్రిడలకు మరియు క్రిడాకారులకు ప్రోత్సహిస్తున్నందుకు గర్వాంగా ఉందని తెలిపారు. అనంతరం విద్య సాధన కళాశాల కరస్పాండెంట్ పీ.మన్సూర్ అలీ ఖాన్ గారు మాట్లాడుతూ క్రిడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని కోరారు,అలాగే జమీల్ పేరు మీద జరిగే ఈ లీగ్ లో పాల్గొన్న 8 టీంలకు కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్ లో ఒక జట్టు మాత్రమే ఫైనల్లో గెలుస్తుంది అలాగని రునర్లుగా నిలిచిన క్రిడాకారులు భవిష్యత్తులో జరిగే టౌర్నమెంట్లలో మరింత కష్టపడీ గెలుపును అందుకోవాలని కోరారు. జమీల్ ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వాహకులు మరియు కె.కె.ఆర్ అధ్యక్షుడు తారిఖ్ అలీ మాట్లాడుతూ జమీల్ ఛాంపియన్స్ ట్రోఫీ 2023 ఫైనల్ మ్యాచ్ కు విచ్చేసిన అతిధులు, ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఫైనల్ మ్యాచ్ వివరాలు తెలుపుతూ షైనింగ్ కె.కె.ఆర్, మరియు మేధన్స్ స్టార్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్ లో షైనింగ్ కె.కె.ఆర్ జట్టు తమ అద్భుతమైన ఆట తీరుతో జమీల్ ట్రోఫీ 2023 తమ పేరిట కైవసం చేసుకుంది.మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ మోహి ద్ మరియు మ్యాన్ ఆఫ్ దీ సీరీస్ ఫయాజ్ కీ అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యాసాధన కళశాల అధినేత పీ.మన్సూర్ అలీ ఖాన్,జమీల్ మొబైల్స్ అధినేత జమీల్,ముష్టాక్, టీ.డీ.పీ నాయకుడు సుబ్బారెడ్డి,హీనా, అఖిల్, తాహిర్ కె.కె.ఆర్ సభ్యులు సమీ,ఛాంపియన్లుగా నిలిచిన షైనింగ్ కె.కె.ఆర్ మరియు రన్నర్లుగా నిలిచిన స్టార్స్ జట్టుకు ట్రోఫీలు మరియు క్రికెట్ కిట్స్ బహుమానంగా అందజేసారు.

వెన్నెల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కమలాపురం : సంక్రాంతి పండుగ సంబరాలను ముందుగానే మొదలయ్యాయి. నగరంలోని వెన్నెల పాఠశాలలో సంక్రాంతి పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్ అప్పాజీ ఆధ్వర్యంలో విద్యార్థులు లను ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు తెలియజేశారు. అంతకుముందే భోగిమంటలు వేసి ఆటలు పాటలతో సందడి చేశారు. విద్యార్థులను నృత్యలతో పాటు ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పెట్టి మన దేశ సంప్రదాయాలను పల్లెటూరు వాతావరణం లో ఏ విధంగా ఉంటాయో అనేది చూపులకు కన్నుల విందులుగా చేసినట్లు చూపించారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: పీసీసీ చీఫ్ రుద్రరాజు

విశాలాంధ్ర-వేంపల్లె: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు దివంగతనేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ చీఫ్ గిడుగు రుద్ర రాజు కొనియాడారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా ఆయన మీడియా చైర్మన్ తులసిరెడ్డి, మరికొంత మంది కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బుధవారం వేంపల్లె మండలం ఇడుపులపాయ లోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్ హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అన్న నినాదంతో ముందుకు వెళతామన్నారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్‌పార్టీ శ్రేణులందరిలో నూతన ఉత్సాహం నింపిందన్నారు. రాబోవు ఎన్నికలల్లో ఏపీలో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు.

అద్భుతమైన కట్టడం రామాలయం

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : దక్షిణ భారత దేశంలోనే అద్భుతమైన కట్టడం రామాలయం అని ఇది శిల్పసంపదకు నిలయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక కోదండరాముడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాద ప్రకారం టీటీడీ అధికారులు, రాజంపేట కాంగ్రె స్ పార్టీ ఇన్‌చార్జి సోమిశెట్టి మనోహర్‌బాబు ఆహ్వానం పలికారు. అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం వేదపండితులు రామాలయ చరిత్ర, స్థల పురాణం క్షుణ్ణంగా వివరించారు. అనంతరం వారిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అందుకు రాహుల్‌గాంధీ జోడో పాదయాత్రకు వచ్చే జనసంద్రత నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సెక్రటరీ బీసీ మేయప్పన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్, రాష్ట్ర కోఆర్డినేటర్ రామ్మూర్తి, రాష్ట్ర బీసీ కోఆర్డినేటర్ బాలకృష్ణ, కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, రాజంపేట అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి సోమిశెట్టి మనోహర్‌బాబు, శ్రీరాములు, కోవెలకుంట శీను తదితరులు పాల్గొన్నారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : సైకో ప్రభుత్వం పోవాలి సైకిల్ రావాలి, అమరావతి అభివృద్ధి చెందాలని నగరంలోని 46వ డివిజన్ ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి విఎస్ అమీర్ బాబు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వికాష్ హరి, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి, రైతు నాయకుడు లక్ష్మిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసాడని, రోజు ప్రతి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అసమర్థ సీఎం వెంటనే దిగిపోవాలని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయ కుమార్,46 వార్డ్ ఇన్చార్జ్ భరత్ కుమార్ రాజు, కృష్ణంరాజు, అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు,రాష్ట్ర నాయకులు సానపురెడ్డి రవిశంకర్ రెడ్డి,వరప్రసాద్, నబికోట్ శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షులు మమ్మద్, నాయబ్, వార్డు ఇన్చా ర్జులు కోండెటి జనార్దన్ రెడ్డి, గాజులపల్లి రాఘవ, శ్రీనివాసులు నాయుడు, రాయల్ కరీముల్లా, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని 9వ వార్డులోని శ్రీనివాసనగర్‌లో 4వ రోజు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ నియోజికవర్గ ఇంచార్జ్ డా.జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాసనగర్ లోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నియంత పాలన సాగిస్తున్నా రని అన్నారు. ప్రజలపై అనేక పన్నుల భారం మోపుతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ప్రజలకు చెత్తపన్ను విధించడం, కరెంట్ బిల్లు పెంచారని, పెన్షన్లు తీసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బ్రహ్మరధం పడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, 9వ వార్డుకు చెందిన కరీముల్లా, బూన్, షఫీ, శ్రీనివాసులు, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జమ్మలమడుగు: క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో బుధవారం ఆయన అధికారులతో కలిసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించాలనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. 13వ వార్డుల్లో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపలో ఉన్న సభ్యులతో ఆత్మీయంగా పలకరిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా అడుగులేస్తున్నారు. ముఖ్యంగా ఇంటి స్థలాలు ఇవ్వలేదని, గృహ నిర్మాణాలు మంజూరు కాలేదని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అధికారులు, వాలంటీర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



గంజాయి విక్రయిస్తూ దొంగ నోట్లు చలామణి చేస్తున్న ఐదుగురు అరెస్టు

విశాలాంధ్ర-కడప క్రైం : గంజాయి అక్రమ కొనుగోలు, అమ్మకం, దొంగ నోట్లు చలామణి చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.40 లక్షలు విలువ చేసే గంజాయి, వాహనాలు, నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. బుధవారం పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మైదుకూరు డి.ఎస్పీ వంశీదర్ సూచనలతో, మైదుకూరు రూరల్ సి.ఐ వై నరేంద్రరెడ్డికి గంజాయి అక్రమ రవాణా, అమ్మకము, కొనుగోలు గురించి రాబడిన నమ్మకమైన సమాచారం మేరకు దువ్వూరు ఎస్.ఐ ఆర్ రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది, రెవిన్యూ అధికారులతో కలసి బుధవారం ఉదయం 9 గంటల సమయంలో దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలో సబ్‌స్టేషన్ వద్ద దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో గంజాయి అక్రమ కొనుగోలు, అమ్మకం, దొంగనోట్లు చలామణి చేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం గూడెం గ్రామానికి చెందిన మొగల్లపు నవీన్ కృష్ణ (36), కర్నూలు జిల్లా రుద్రవరం మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి హరి (38), నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన భుగ్గా బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బుల్లెట్ (21), దువ్వూరు మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన గుర్రాల మునిరెడ్డి (40), కర్నూలు జిల్లా ఆలమూరు మండలం చిత్రేనిపల్లి గ్రామానికి చెందిన జేస్టాది నడిపి ఓబులేసు (34)లను అరెస్టు చేశారని ఎస్పీ వివరించారు. వీరి వద్ద నుండి రూ.40 లక్షలు విలువ చేసే 30 కేజీల గంజాయి, 3 కార్లు, 5 సెల్ పోన్లు, 7 నకిలీ నోట్లు(రూ.500లు నోట్లు) స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఐదుగురి పై ఇసుక, ఎర్రచందనం తదితర కేసులు పలు పోలీసు స్టేషన్లలో వివిధ నేరాలకు పాల్పడిన కేసులు వున్నాయన్నారు. ఈ గంజాయి అక్రమ కొనుగోలు, అమ్మకంలో ఒడిషా కు చెందిన వ్యక్తి ప్రధాన

దోపిడీ వ్యవస్థపై తిరగబడ్డ యోధుడు ఎన్ఎస్

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : భూ సామ్య కుటుంబంలో పుట్టి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలబడ్డ కమ్యూనిస్టు యోధుడు నర్రెడ్డి శివరామిరెడ్డి అని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే ఎన్ శివరామిరెడ్డి నాలుగవ వర్ధంతి కార్యక్రమాన్ని ఎద్దుల ఈశ్వర్ రెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ కడప జిల్లాలో తొలితరం కమ్యూనిస్టులలో శివరామిరెడ్డి ఒకరని, ఆయన కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లెలో 1922 ఫిబ్రవరి 25న నర్రెడ్డి శివరామిరెడ్డి జన్మించారు. ఆయన పెత్తందారి భూస్వామ్య కుటుంబంలో పుట్టి, పెత్తందారి వ్యవస్థకు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదల పక్షాన నిలబడిన కమ్యూనిస్టు యోధుడు ఎన్. శివరామిరెడ్డి. స్వాతంత్ర ఉద్యమంలో అనేక క్రియాశీలక పోరాటాలు చేయడం, సిపిఐపై నిషేధం ఉన్న రోజుల్లో రహస్య కార్యకలాపాలు నిర్వహించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చట్టసభకు ఎన్నికైన తొలితరం ప్రజా ప్రతినిధుల్లో ఒకరు. 1957లో కమలాపురం,పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం సీపీఐ ఎమ్మెల్యేగా శివరామిరెడ్డి ఎన్నికయ్యారు. గతంలో సీపీఐ కడప జిల్లా కార్యదర్శిగా ఆయన పనిచేశారు. రైతులోకం, అరుణోదయ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. వెనుకబడిన రాయలసీమ పురోగతి ప్రాజెక్టుల నిర్మాణంతో సాధ్యమని భావించి ఉద్యమబాట పట్టారు. 1996లో గండికోట ప్రాజెక్టు శంకుస్థాపన కోసం ఆయన నాటి కడప కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేశారు.. కడప జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల కోసం అనేక పోరాటాలు చేశారని ఆయన పోరాట కృషికి గుర్తుగా సర్వరాయ సాగర్‌కు నర్రెడ్డి శివరామరెడ్డి పేరు పెట్టారన్నారు.పలు పత్రికలకు వ్యాసాలు రాసి గుర్తింపు పొందారన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, కొమ్మది ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ కట్ట యానాదయ్య, జయన్న, బాలచంద్రయ్య, ద్రావిడ సురేష్, చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కృష్ణమూర్తి, సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బాదుల్లా, సావంత్ సుధాకర్, మునయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వల్లరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా క్యాలెండర్ విడుదల

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ సంచాలకులు నాగేశ్వరరావు బుధవారము కలెక్టరేట్లో తన చాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వివిధ అంశాలపైన అవగాహన కల్పించే విధంగా క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో రైతులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య జిల్లా ఉపాధ్యక్షులు జయన్న, బాలచంద్రయ్య, గంగా సురేష్, కట్టా యానాదయ్య,చంద్రశేఖర్ రెడ్డి, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి టీపీఓగా ఇందిర

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక ప్రణాళికా విభాగం అధికారినిగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టీపీఎస్‌గా పనిచేస్తున్న ఇందిరకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ టౌన్ కంట్రీ ప్లానింగ్ అధికారులు (డీటీసీపీ) ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిర గతంలో కూడా ఇక్కడ ఇన్‌చార్జి టీపీఓగా పనిచేసిన అనుభవం ఉంది. మరోమారు ఆమెకు ఇన్‌ఛార్జి టీపీఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. నేడో రేపో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాజు హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని రాజు హైస్కూలు నందు బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయబద్ధంగా అచ్చ తెలుగు వారి ఆచారాల ప్రకారం దుస్తులు ధరించి పిల్లలకు భోగి పండ్లతో స్నానమాచరించి అనంతరం భోగి మంటలు వేసి ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ సంబరాల్లో ముఖ్య అతిధిగా బి.సి.సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్, కరెస్పాండెంట్ ఉదయ్, హెడ్మాస్టర్ బొజ్జ ఓబయ్య, ఇడెం సురేంద్ర, ఆంజనేయులు, వరలక్ష్మి, మహేశ్వరి, స్వప్న, జబీన, అమీష, హిమ బిందు, శాంతి, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-వల్లూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అడిషనల్ డిఎంహెచ్ఓ ఖాదర్‌వల్లి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ వ్యాధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపికృష్ణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం నందు పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో విష జ్వరాలు, అంటువ్యాధులు వ్యాప్ కింద కుండా ముందస్తుగా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. మండలంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నలక్ష్మి, సిహెచ్ఓ వేణుగోపాల్, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

విశాలాంధ్ర-లింగాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత, రైతుభరోసా సంక్షేమ పథకాలపై ఎంపీడీఓ సురేంద్రనాథ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని తెలిపారు.

కోడిపందేంలు, పేకాట నిషేధం: ఎస్ఐ

విశాలాంధ్ర-అట్లూరు : తెలుగు ప్రజలందరు సాంప్రదాయ బద్దంగా జరుపుకునే సంక్రాంతి పండుగకు కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని బుధవారం అట్లూరు ఎస్ఐ కె.సి.రాజు అన్నారు. సంతోషాలతో మూడురోజుల పాటు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాల న్నారు. కోడిపందేలు, జూదాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేసి కఠిన చర్యలుతీసు కుంటామన్నారు. పండుగలకు ఇతర ఊర్లకు వెళ్లే వారు తమ ఇంట్లో నగదును బంగారు వంటి వస్తువులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రమణారెడ్డి, వెంకటేష్, రమణ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడండి: కమీషనర్ జగన్నాథ్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పురపాలిక పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ పేర్కొన్నారు. బుధవారం 1, 2, 3 వార్డు సచివాలయాల పరిధిలోని నోడల్ అధికారులు, కార్యదర్శులు, సెక్షన్ హెడ్‌లు, వాలంటీర్లతో సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో వైస్ చైర్మన్ వర్రా చంద్రకళ, కౌన్సిలర్లు తుంగా వెంకటరామిరెడ్డి, మహ్మద్ ఆలీ, భాస్కర్, కల్లూరు సునీతతో పాటు వైసీపీ నాయకులు మోపూరి ప్రశాంత్, వర్రా డేవిడ్, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య పాల్గొన్నారు. కమీషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయడం ద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని వివరించారు. ఆమేరకు ప్రభుత్వ పథకాలపై ప్రజలలో అవగాహన పెంచి నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా అందరం కృషి చేయాలన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు.

శానిటేషన్ సిబ్బందికి బట్టల పంపిణీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : 44వ డివిజన్ కాగితాల పెంట సచివాలయ పరిధిలోని శానిటేషన్ సిబ్బందికి కార్పొరేటర్ వెల్లాల హేమలత, వైసిపి డివిజన్ ఇంచార్జ్, న్యాయవాది వెల్లాల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సచివాలయ సిబ్బందికి బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్లో కార్మికుల సేవలు ఎనలేని వని కొని యాడారు. డివిజన్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు జేజేరెడ్డి, పుత్తా వెంకట సుబ్బారెడ్డి కార్పొరేటర్లు బాలస్వామి రెడ్డి, చల్లా రాజశేఖర్ మున్నా, డివిజన్ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కెజి పల్లెలో ముందస్తు సంక్రాంతి

విశాలాంధ్ర- పులివెందుల: సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె (కెజిపల్లె) ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ప్రధానోపాధ్యాయుడు అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. దేశ సంపద, సంస్కృతీ సంప్రదాయాలు తదితర అంశాలను ఉట్టిపడేలా ముగ్గులను తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగకు అలవాలమైన గొబ్బెమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులందరూ సంప్రదాయ దుస్తులను ధరించడంతో పండుగ వాతావరణం కనిపించింది. చిన్నారులు ఆలపించిన గొబ్బెమ్మ పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం సంక్రాంతి విశిష్టత తదితర అంశాలను అంగడి నాగేంద్ర విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భాస్కర్, ప్రశాంతి, లక్ష్మిగౌరి, జ్యోతి, విద్యాకమిటీ చైర్మన్ గంగామహేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష నూట16ల విరాళం

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం మారెళ్లమడక పంచాయతీ పరిధిలోని గండిక్షేత్రంలో చేపట్టిన నిత్య అన్నదాన పథకానికి బుధవారం రూ.1,00,116లు విరాళం ప్రకటించారు. పెండ్లిమర్రి మండలం బాలయ్యగారి పల్లెకు చెందిన చింతలపల్లి బాలగంగాధర్‌రెడ్డి ధర్మపత్ని స్ఫూర్తి కుటుంబ సభ్యులు ఈ వితరణ అందజేశారు. ఆ మేరకు మొత్తాన్ని గండిక్షేత్రంలో ఈవో ముకుంద రెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్‌లకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు వీరాంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు. భక్తులు కూడా మరింత ముందుకు వచ్చి నిత్య అన్నదాన పథకానికి విరాళాలు అందజేయాలని వారు కోరారు.

గిడుగు ఆదేశాలే మాకు శిరోధార్యం: కాంగ్రెస్

విశాలాంధ్ర-పులివెందుల: పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు ఆదేశాలే తమకు శిరోధార్యమని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పీసీసీ చీఫ్‌తో కలిసి వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి అక్కడి వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమపార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర తమకు ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. త్వరలో తాము కూడా గిడుడు ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటామన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్‌పార్టీ తిరుగులేనిశక్తిగా ఎదుగుతుందని, మళ్లీ పూర్వపు వైభవం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి :ఆర్డీఓ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పురపాలిక పరిధిలోని జగనన్న లేఅవుట్ కాలనీలో కొనసాగుతున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా పేదల సొంతింటి కల సాకారం చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు సూచిం చారు. బుధవారం ఆయన లేఅవుట్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాలకు సంబందించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ప్రణాళికాబద్దంగా వ్యవహరిస్తూ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని ఆయన కోరారు. నిర్మాణం పనులకు సంబందించి సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలని ఆయన పేర్కొన్నారు. సచివాలయాల, గృహ నిర్మాణశాఖ ఇంజనీర్లు, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించడం ద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేర్చాలని ఆయన సూచించారు. నిర్మాణం పనుల్లో నిర్లక్ష్యం తగదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తాహసీల్దార్ నాగేశ్వరరావు, పురపాలిక కమీషనర్ జగన్నాథ్, హౌసింగ్ ఏడీ విజయబాబు, ఏఈ శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె మండలంలో జరిగే భూకబ్జాదారులపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకాపా నాయకులు కొండలను పిండి చేస్తూ మట్టిని అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారని విమర్శించారు. వైకాపా అగ్ర నాయకులు విశాఖలోని రుషి కోండలను తవ్వకాలు చేస్తుంటే ఇక్కడ ద్వితీయ శ్రేణి నాయకులు వేంపల్లెలోని కొండలను తవ్వేస్తున్నారని చెప్పారు. వైకాపా పాలనలో భూ ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలపై విచారణ చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే విధంగా చర్యలు చేపట్టుతామని చెప్పారు. అవినీతి చేసిన అధికారులపై కూడ చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ భూములను సొంత భూములు లాగ లేఅవుట్లు వేసి విక్రయాలు చేస్తున్నారని దీని వల్ల అమాయక ప్రజలు మోసపోతున్నారని చెప్పారు. ఈవిలేకరుల సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, మారుతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-బద్వేల్ : నిరంతరం ప్రజల పక్షాన సమస్యల పైన సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తున్న విశాలాంధ్ర దినపత్రిక దినదిన అభివృద్ధి కావాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం నందు ఆయన చేతుల మీదుగా విశాలాంధ్ర నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నో పేపర్లుపుట్టి పెరిగి కనుమరుగుతున్న తరుణంలో నిరంతరం ప్రజల సమస్యలను బాహ్య ప్రపంచానికి తెలియజేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ముందుకు దూసుకుపోతున్న విశాలాంధ్ర పత్రిక అభివృద్ధి కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ముని కుమార్ సిపిఐ నాయకులు వీర శేఖర్ బాలు పివి రమణ సంజీవ్ పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-చెన్నూరు : బీసీలకు తీరని అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది వైసీపీ అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కల్లూరి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో బీసీ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా ఆటోబాబును ఉపాధ్యక్షుడుగా కుందేటి కృష్ణయ్య యాదవ్‌ను, 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షుడు ఆటోబాబు మాట్లాడుతూ మండలంలో బీసీల సమస్యల కోసం పోరాడుతానని బీసీలకు సమస్య ఏదైనా ఉంటే నా దృష్టికి తీసుకువస్తే మా నాయకుడు పుత్తా నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బీసీలకు ద్రోహం చేసిన వైసీపీని భూస్థాపితం చేసేందుకు మండలంలోని బీసీలంతా ఐకమత్యంగా పోరాడాలని, టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరెడ్డి శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, షబ్బీర్, మన్నూరు అక్బర్, ఏవి భాస్కర్, వేల్పుల సుబ్రమణ్యం, బొమ్మన శ్రీకాంత్, జడ లక్ష్మీనారాయణ, చెన్నయ్య, సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీలు సాధించేవరకు పోరాటం : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : నగరంలోని హెూచిమిన్ భవన్‌లో బుధవారం విద్యార్థి యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఆర్ నాయక్ రాజేంద్ర ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.దస్తగిరి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిన్ని, వి, శివకుమార్, ఏపీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటు తున్న ప్రత్యేక హెూదా విభజన హామీల గురించి మాట్లాడకుండా విద్యార్థులను యువజనలను జగన్ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను యువకులను చైతన్య పరిచి ఈనెల 20న హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో బస్సు యాత్ర బయలుదేరుతున్నదని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సురేష్ నాయక్, ఏఐవైఎఫ్ నాయకులు రాహుల్, నాగార్జున ఏఐఎస్ఎఫ్ నాయకులు మైనుద్దీన్ అరున్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులయేనిలో పచ్చదనం-పరిశుభ్రత

విశాలాంధ్ర-వేముల: వేముల మండలం ఎద్దులయేని గ్రామంలో బుధవారం ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల విద్యార్థుల జాతీయ సేవ పథక కార్యక్రమంలో భాగంగా బుధవారం 6వ రోజు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న అన్ని వీధులలో క్రిమి సంహారం కోసం బ్లీచింగ్ పౌడర్ చలారు. వైట్ వాష్ చేసిన చెత్త కుండీలకు పేయింట్‌తో చెత్త కుండి అని రాసి, చెత్తను చెత్త కుండలలోనే వేసేలా అవగహన కల్పించారు. చెట్లు, నీరు, చదువు, పర్యావరణం, కాగితపు కవర్ల వాడుక గురించి నినాధాలు వివరిస్తూ గ్రామం ర్యాలీ నిర్వహించారు రైతుల పొలాల సంరక్షణ కోసం, వాళ్ళు పండిచే పంటలకు కావాల్సిన సలహాలను ఇస్తూ పంటల సంరక్షణ, ప్రాముఖ్యత గురించి వ్యవసాయ అధికారి వి.చిన్నారెడ్డి, సునిల్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి జి. దత్తారెడ్డిలు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వారు పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల వాలంటీర్లు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని కళాశాల ఎన్.ఎస్.ఎస్ అధికారి డాక్టరు ఏడుకొండలు, డాక్టరు జయమ్మలు పేర్కొన్నారు.

బ్రహ్మంగారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: ప్రముఖ కాలజ్ఞానకర్త శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నందు బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు బ్రహ్మంగారి మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి, నంద్యాల ఇన్స్‌పెక్టర్ కిరణ్, ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, పూర్వపు మఠాధిపతులు శ్రీశ్రీ వీరబోగవసంత వెంకటేశ్వర స్వామి వారి జ్యేష్టపుత్రుడు శ్రీ వెంకటాద్రి స్వాముల వారు మరియు దత్తాత్రేయ స్వాములవారు, ఆలయ సిబ్బంది, భక్తుల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. ఈ హుండీల ద్వారా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంకు నగదు రూపంలో భక్తులు సమర్పించుకున్న కానుకలు రూ.23లక్షల 599, బంగారు 4గ్రాములు, వెండి 51గ్రాములు వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 19వ తేది నుండి జనవరి 11వరకు లెక్కించినట్లు తెలిపారు.

వికాస్ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం అక్కాయపల్లెలో గల వికాస్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు లింగారెడ్డి, కడప నియోజకవర్గం ఇంచార్జ్ అమీర్ బాబు, స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ, స్కూల్ ఫౌండర్ సరస్వతమ్మ ముఖ్య అతిధులుగా విచ్చేసినారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ నేటి నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సాంప్రదాయం విలువలు మర్చిపోతున్నారని అలా కాకుండా వికాస్ హైస్కూల్లో సాంప్రదాయ పద్ధతిగా సంక్రాంతి పండుగ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగిమంటలలు, రంగవల్లుల లు, కోడిపందాలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థినీలకు ప్రథమ , ద్వితీయ, తృతీయ, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ హమీద్, ఇన్చార్జ్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి పారుదల సంస్థ, కడప విభాగం

షార్ట్ టెండరు ప్రకటన

టెండరు నోటీసు నెం. /07/ఇఇ/ఆర్‌ఐసి/కెడిపి/2022-23 తేది : 11.01.2023

వైఎస్ఆర్ జిల్లా యందు 37.00లక్షల అంచనా విలువ గల వివిధ గ్రాంట్లు క్రింద మంజూరు అయిన 03 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూలు దరఖాస్తు చివరి తేది 17.01.2023 టెండరు స్వీకరణకు చివరి తేది 19.01.2023 మ॥3.30 గం॥ వరకు.

మిగతా వివరములకు కార్యాలయ పనివేళ యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, కడప డివిజన్, కడప



విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని రామాపురం పరిధిలో ఉన్న హౌసింగ్ కాలనీ .గువ్వలచెరువు. గోపగుడిపల్లి కల్పనాయుని చెరువు. నీలకంఠరావుపేట. గ్రామాల్లోని సచివాలయం బుధవారం ఎంపీడీవో హైదర్ వల్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వారికి సమాధానాలు ఇవ్వాలన్నారు. అలాగే హౌసింగ్ సిబ్బంది హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ పెట్టకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని ఆయన అన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు సహకరించని సిబ్బందిపై కూడా చర్య తీసుకుంటామన్నారు. సచివాలయంలో ప్రతిరోజు సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని. ఈ కార్యక్రమంలో సిబ్బంది అన్ని శాఖల వారు ఉండాలన్నారు. ఒకవేళ సిబ్బంది ఎవరు లేకపోయినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగమణి హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: సంస్కృతికి ప్రతీక ముందస్తు సంక్రాంతి సంబరాలు అని సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఎంవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం సిల్వర్ బెల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికి తీసేందుకు సంక్రాంతి సంప్రాదాయ పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంక్రాంతి పండుగ గొప్పదనాన్ని ప్రత్యక్షంగా విద్యార్థులకు తెలియజేశారు. పిల్లలపై భోగి పండ్లు వేయడం, హరిదాసు, సోది చెప్పేవారు, అమ్మవారు, రైతులు, గంగిరెద్దులు, కోడిపుంజు తో, వివిధ వేషధారణలతో పిల్లలు సందడి చేసి పలువురిని ఆకట్టుకున్నారు. గొబ్బెమ్మ పాటలు పలువురిని కనువిందు చేశాయి. కుమార్ భోగి కుప్పకు నిప్పుటించారు. సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. హెడ్మాస్టర్ లక్కాకుల రాహుల్ మాథ్స్ టీచర్ రవి, ఇన్చార్జి స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని సందడే సందడి చేశారు.

శ్రీ చైతన్య లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రాజంపేట : పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో గల శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆవరణలో రంగవల్లులను అలంకరించారు. భోగిమంట వేసి గౌరమ్మ పాటలతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహూ తులను అలరించాయి. అనంతరం ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగువారికి అత్యంత ప్రతిష్టాత్మకమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. సంక్రాంతి వైభవం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకట సుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్చార్జి శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్చార్జి కస్తూరి, పీఈటీలు చంద్రశేఖర్, శాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రామేష్ నాయుడు

విశాలాంధ్ర-రాజంపేట : స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజులు తెలియజేశారు. బుధవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రమణ్యం రాజు, జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ స్వామి వివేకానంద 160 వ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం మంచి పరిణామమని స్వామి వివేకానంద దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి దండే రవికుమార్, మాజీ అధ్యక్షులు ఏ.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయినీ-ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

బాయ్స్ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గాలివీడు: మండలకేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి ఎంపీడీఓ శేఖర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులందరూ సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. రంగవల్లులు, ఉట్టికొట్టడం, భోగిమంటలు, విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు పండుగ విశిష్టతపై అవగాహన కల్పించేందుకే ముందస్తు వేడుకలు నిర్వహించామన్నారు. చివరగా మహిళా ఉపాధ్యాయినులు సంక్రాంతి వంటకాలతో విందు ఏర్పాటు చేశారు.

రుణదాతపై హత్యాయత్నం

విశాలాంధ్ర-మదనపల్లి: తీసుకున్న రుణం తిరిగి చెల్లించమని అడిగిన పాపానికి ఓ రున్నదాతపై ప్రత్యర్థి ఇనుపురాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి బుగ్గ వంకలో జరిగింది. ఘటనపై ఒకటవ పట్టణ ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వివేకానంద నగర్ వినాయక గుడి దగ్గర కాపురం ఉంటున్న భాస్కర్ కుమారుడు అరుణ్ కుమార్47 బోర్ వెల్ కంపెనీలో ఏజెంట్గా పని చేస్తాడు. ఈ క్రమంలో అతనికి తెలిసిన కట్టు బాబి రెడ్డప్ప అలియాస్ రెడ్డికి ఏడాది క్రితం 25వేల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమని అడిగిన అరుణ్ కుమార్ పై కట్టుబాయి రెడ్డప్ప ఇనుపరాడితో దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-పీలేరు: పట్టణ శివారులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు. పాఠశాలప్రిన్సిపాల్ బి.వి శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగి మంటలు. ముగ్గులు పోటీ డాన్స్ ప్రోగ్రాం వివిధ వేషధారణ పిల్లలను ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్. ప్రసాద్. సూపర్డెంట్ విజయ్ కుమార్.వాణి.సుజాత. జయశ్రీ, పిడి.అంజలి. ఉమాదేవి, వనజ, లీలావతి.మరియు.ఉపాధ్యాయులు.విద్యార్థులు. సెక్యూరిటీ స్టాప్. పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-సుండుపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడి పందాలు మరియు గూండాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఓ పత్రికా ప్రకటన విడుదల చేసి, జూదం, కోడి పందేలు, గుండాట, అక్రమ మద్య విక్రయాలు, మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పైన కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు అండగా వైసీపీ ప్రభుత్వం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పీలేరు: వృద్ధులకు, వికలాంగులకు వైసీపీ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నూతన పెన్షనదారులు అయిన 140మందికి ఆయన పెన్షనలను అందజేశారు. ఇంకా అర్హులైన వారికీ తమ ప్రభుత్వం పెన్షనలను ఇవ్వడానికి సిద్ధముగా ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల కోసం సీఎం జగన్మోహనరెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలు అందించుటకు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ హబీబ్ భాషా, జడ్పిటిసి ఏటి రత్న శేఖర్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, వైస్ ఎంపీపీలు హరిత వెంకటరమణ, ఎస్ వి చలపతి, మాజీ ఎంపీపీ మహిత, మాజీ సర్పంచ్ ఏఎస్ హుమయున్, కే.ఎస్ అగామోహిద్దీన్, జిల్లా ఏపీ టూరిజం కౌన్సిల్ సభ్యుడు షేక్ షాకీర్, నియోజకవర్గ మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీం, వైఎస్ఆర్సిపి నాయకులు డివి రమణ అలియాస్ పెద్దోడు, సుంకర చక్రధర్, మునీర్, షబ్బీర్, ఇంతియాజ్ వార్డు సభ్యులు, అభిద్ పంచాయితీ కార్మికులు, ఈవో ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మల తయారీలో అంతర్జాతీయ స్థాయికి నైపుణ్యత పెరగాలి

అసిస్టెంట్ డైరెక్టర్ టి. సత్యమూర్తి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: రాజారాణి బొమ్మల తయారీలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జౌళి మంత్రిత్వ శాఖ డిసి (హెచ్) అసిస్టెంట్ డైరెక్టర్ టి సత్యమూర్తి పేర్కొన్నారు. శెట్టిగుంట గ్రామపంచాయితీ పరిధిలోని లక్ష్మీగారిపల్లి లో బుధవారం హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఇపిసిహెచ్) అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ వారు నిర్వహించిన గురుశిష్య హస్త శిల్ప శిక్షణ మూడు నెలల వర్క్ షాప్ కార్యక్రమాన్ని టి సత్యమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ వ్యాపారవేత్తలుగా తయారు కావడానికి సహకరిస్తుందన్నారు. మార్కెట్లోకి వస్తున్న కొత్త కొత్త డిజైన్లు పట్ల ముఖ్యంగా మహిళలు పురుషులు ఆసక్తి కనుబరుస్తున్నారన్నారు. హస్త కళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఇపిసిహెచ్) ఇండియా దక్షిణాది రాష్ట్రాల సంచాలకులు కలవకొలను నాగతులసీరావు జూం ద్వారా మాట్లాడుతూ కళాకారులు వివిధ నైపుణ్యాలను అలవర్చుకొని అభివృద్ధి చెందడమే మా ప్రధాన లక్ష్యం అన్నారు. వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. హస్తకళ పరిశ్రమ మీద ఆధారపడిన వేలాదిమంది మహిళలకు పురుషులకు పని కల్పించడంలో ఈపిసిహెచ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ కుమార్ కృషి చేస్తున్నారని కొనియాడారు. శిక్షణ పొందుతున్న కళాకారులకు టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ ఎగ్జిక్యూటివ్ చినిమిల్లి దివాకర్, జౌళి మంత్రిత్వ శాఖ డిసి(హెచ్) ఇన్స్ట్రక్టర్ ధర్మరాజు, రాజారాణి బొమ్మల సీనియర్ కళాకారులు శివయ్య, దేవరాజులు,20 మంది మహిళలు, పురుషులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర- రాయచోటి టౌన్: లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో స్థానిక షిర్డీ సాయి బాబా మందిరం ఆవరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించి అందులో విజేతలుగా గెలుపొందిన ముగ్గిరికి మొదటి బహుమతి గా 7500/- ను రెస్టారెంట్ అధినేత లయన్ బి. నాగిరెడ్డి, రెండవ బహుమతిగా 5000/- ను ఎస్వీ ఫ్యాషన్స్ అధినేత లయన్ వి. వెంకట సుబ్బారెడ్డి, మూడవ బహుమతిగా 3000/- ను ఓబులేశ్వర ట్రేడర్స్ అధినేత లయన్ బి. రాజ శేఖర్ రెడ్డి గార్ల ఆర్థిక సౌజన్యంతో ఇవ్వడం జరిగిందని అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమం లో విశిష్ట అతిథులుగా ప్రముఖ వైద్యులు డా కె.బయరెడ్డి, డా. సంగమ్మ, శోభ రెడ్డి, రామాదేవి, వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి యస్ హరినాధ రెడ్డి, ఉపాధ్యక్షులు లయన్ వి. హరీష్ చంద్ర, కోశాధికారి లయన్ రత్నమాచారి, లయన్ ఆనంద్. నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్ నాయక్, లోకేష్ స్వామి, సుభాష్ చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి పట్టణం లోని బోస్నగర్ లో గల నారాయణ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు, ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ పాఠశాలలు ఏజీఎం చెన్నకేశవరాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులను అధ్యాపకులు భోగిపండ్లతో ఆశీర్వదించారు. చిట్లాకుప్పలు వేశారు. ఈ సంబరాలలో ఆర్ఎస్ఐ శంకర్రెడ్డి, ప్రిన్సిపల్ ఖాదర్వలి, వైస్ ప్రిన్సిపల్స్ సుగుణవేణి, నందిని, యువరాజ్, ఏఓనరసింహులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరించిన టిడిపి నేత

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని ఆరవ పల్లె గ్రౌండ్ నందు జరుగు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను టిడిపి నేత చమర్తి జగన్ మోహన్ రాజు సందర్శించి, క్రికెట్ వీక్షించారు. అనంతరం మాజీ సర్పంచ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీ లను ఆవిష్కరించారు. బుధవారం జరిగిన నీలిపల్లె వర్సెస్ నారాయణ రాజుపేట మ్యాచ్ జరగక విజేతగా నిలిచిన నీలిపల్లె జట్టుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందించారు. ఈకార్యక్రమంలో ఒంటిమిట్ట సీనియర్ నాయకులు మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య,లైన్స్ క్లబ్ కుర్రా మనీ యాదవ్, చామంచి పెంచల య్య, వెంకటయ్య, ఖలీద్,సుబ్రహ్మణ్యం, వెంకటే శ్వర్లు, ఒంటిమిట్ట వినోద్ రెడ్డి, సూర్యనారాయణ రాజు, సురేష్, కొండిశెట్టి సుదర్శన్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు పల్లె గీష్మంత్ రెడ్డి, మాడపూరి శ్రీరాములు, తోట శివశంకర్ పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సమానమే

విశాలాంధ్ర- రామాపురం : క్రీడల్లో గెలుపోటములు సమానమేనని మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి అన్నారు మండలంలోని సరస్వతి పల్లి గ్రామంలో బుధవారం లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ఆ గ్రామ సర్పంచ్ మునీర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్ కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు మీకు స్పోర్ట్స్ లో సరైన నైపుణ్యం నిర్ణయం తీసుకోవడం జీవితంలో నిజమైన ఎంపికలు ఉంటేనే మీరు భవిష్యత్తును మార్చగలరు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ చేర్మెన్ కర్ణపు విశ్వనాథ్ రెడ్డి,జడ్పీటీసీ మాసన వెంకటరమణ,వైస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ మున్నీర్ బాషా,మహబాషా,వైసు ఎంపీపీ బాబు, రమణ, కదిరిప్ప నాయుడు, దువూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించండి

రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు

విశాలాంధ్ర-సుండుపల్లె : జగన్ పాలనలో ప్రజలు అభద్రతా భావనలోనికి పోయారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వనరులు యథేచ్ఛగా దోపిడీకి గురి అవడాన్ని బిజెపి సహించదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు రక్షణగా ఉండకుండా అధికార పార్టీ నాయకుల సహకరిస్తున్నారన్నారు. వ్యవస్థలు కుంటుపడితే కాపాడే నాథుడే ఉండడు, మరో అంతర్యుద్ధానికి దారి తీస్తుందని చీకటి జీవో లు తెచ్చేది వాళ్ళే, అతిక్రమించేది వాళ్ళేనన్నారు. నిత్యావసరాలు, పెరిగిన ధరలు కారణంగా పండుగలు సైతం సంపూర్ణంగా చేసుకోలేని పరిస్థితి కొత్త సంవత్సరంలో ఏర్పడిందన్నారు. అభివృద్ధి వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మండల అధ్యక్షుడు చుండుపల్లి రామ జగదీష్, సీనియర్ నాయకులు నాగరాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రెడ్డిచెర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జీరో నినాదం రాష్ట్రంలో వినపడుతుంది

టిడిపి సీనియర్ నేత చమర్తి

విశాలాంధ్ర-రాజంపేట : రాష్ట్రంలో జరుగుతున్న అరాచక, అనాగరిక, దోపిడీ, దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి, భూకబ్జాలు, విచ్చలవిడితనం పోవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదకరంగా ఉన్నటువంటి పరిస్థితి లో అంబేద్కర్ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం నిలబడాలి అంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర భవిత కొరకు,రాష్ట్ర ప్రజానీకం, రాష్ట్ర అభివృద్ధి కోసం భావి పౌరుల బంగారు భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరియు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వీరి కలయికను రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. వీరి కలయిక శుభపరిణామం అని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్ రాజు,మరియు ఒంటిమిట్ట మండల సీనియర్ నాయకులు,మాజీ కల్లుగీత కార్మిక డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నందలూరు మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సమ్మెట శివ ప్రసాద్, హరినాథ రెడ్డి,వినోద్ రెడ్డి,బాలకృష్ణ శివారెడ్డి,హరి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివ కుమార్,సూర్య రాజు,సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

విశాలాంధ్ర-గాలివీడు: విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రము లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయుల నిర్మల ,నాయకులతో కలిసి నాడు నేడు ఫేస్.2కింద 1.20 కోట్ల రూపాయల పనులకు భూమి పూజ చేశారు. ఇందులో11 అదనపు గదులను నిర్మాణానికి సుదర్శన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మన బడి, నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా నాణ్యమైన వస్తువులను అందించారన్నారు. నూతన విద్యా విధానం తీసుకురావడంతో పాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ కు దక్కుతుందన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దు తున్నారన్నారు.

రైతువారీ పట్టా ఇవ్వాలంటూ ధర్నా

విశాలాంధ్ర- రామసముద్రం: ఇనాం భూములకు రైత్వారి పట్టాలు ఇవ్వాలంటూ బుధవారం మండలంలోని నారిగానపల్లె పంచాయతీ ఎగువ దిగువ లంబం వారి పల్లి గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నారిగానుపల్లి గ్రామం పైకి తమ పూర్వీకుల కాలం నుండి భూములను సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. వంద సంవత్సరాలకు ముందు నుండి తాము ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. 1961 సంవత్సరం ముందు అనుభవ సాగుదారుల జాబితాను 1960 తర్వాత ప్రస్తుతం అనుభవదారుల జాబితా జతపరిచి అధికారులకు అందజేశామని అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వరంలా ముఖ్యమంత్రి సహాయనిధి

విశాలాంధ్ర- రామాపురం : సీఎం సహాయనిధి నుండి మంజూరైన రెండు చెక్కులను బుధవారం ఉదయం రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లెలో లబ్దిదారులకు శ్రీకాంత్ రెడ్డి, మోహన్ రెడ్డి లు అందచేశారు. రామాపురం మండలంలోని కల్పనాయుని చెరువుకు చెందిన చింతాకుల సావిత్రమ్మకు రూ 2.70 లక్షలు,నీలకంటరావుపేట కు చెందిన మండెం రెడ్డి హేమంత్ కు రూ 1.50 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బాబు, సర్పంచ్ లు ఆయూబ్,వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి, శ్రీను,రషీద్, సహదేవ రెడ్డి,ఖతీబ్,జాఫర్, కృష్ణయ్య, , జనార్ధన రెడ్డి, రెడ్డెయ్య,సుబ్బారెడ్డి, విజయభాస్కర్, జనార్ధన, శివ శంకర,చలపతి, శివ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పీఎం కిసాన్ నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-చిట్వేలి : చిట్వేల్ మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గల రైతులకు తెలియచేయటం చేయనగా పీఎం కిసాన్ ఈకేవైసీ ఇప్పటి వరకు మండలంలో 3896 మంది చేయించుకున్నారని ఇంకా మనకు 1356 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ నెల 15 వ తేదీ ఈకేవైసీకి చివరి రోజుగా ప్రకటించారని అందరు మీ రైతు భరోసా కేంద్రంకి వెళ్లి పీఎం కిసాన్ ఈకేవైసీని చేయించుకోవాలన్నారు. రబీ 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకర్ తెలిపారు.

సాయి వికాస్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-చిట్వేలి : మండలంలోని శ్రీ సాయి వికాస్ హైస్కూల్‌లో బుధవారం కరస్పాండెంట్ రెడ్డయ్య ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ముగ్గులు వేసి ముస్తాబు చేశారు. భోగి మంట వేసి కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-రామాపురం : మండల పరిధిలో కడప చిత్తూర్ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ దక్షిత వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రహదారిపై మంచు కూడిన ముబ్బు పట్టి రోడ్డు కనిపించకపోవడంతో ఎదురుగా వస్తున్న లారీని తప్పించపోయి ప్రక్కనే వున్న కల్వర్టును రాయచోటి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు లేవు. బస్సు ముందు భాగమున పూర్తిగా దెబ్బతినింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మిట్స్‌లో టీచర్ ట్రైనింగ్ రీసెర్చ్

విశాలాంధ్ర-మదనపల్లి: మిట్స్ కళాశాల మరియు చెన్నై లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ తో అవగాహన ఒప్పందం ను చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. చెన్నై లోని యెన్ఐటిటిటిఆర్‌లో జరిగిన ఏం.ఓ.యూ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మరియు యెన్ఐటిటిటిఆర్ చైర్మన్ డాక్టర్ వి.ఎస్.ఎస్. కుమార్ మరియు డైరెక్టర్ డాక్టర్ ఉషా నటేశన్ లు ఒప్పంద పత్రాల పై సంతకాలు చేసినారు. ఈ ఒప్పందము ద్వారా కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులతో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో పరిశోధన సహకారాన్ని యెన్ఐటిటిటిఆర్ ద్వారా ఏర్పాటు చేయడం, అధ్యాపకులు మరియు విద్యార్థుల కోసం కెరీర్ మరియు టెక్నికల్ పరంగా యెన్ఐటిటిటిఆర్ వారితో శిక్షణలు మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిచడం మరియు పాల్గొనడం, విద్యార్థి ని విద్యార్థులకు యెన్ఐటిటిటిఆర్ లో ఇంటర్న్‌షిప్‌లు అందిచడం ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉదేశ్యం అని ప్రిన్సిపాల్ యువరాజ్ అన్నారు. ఈ కార్యక్రమం లో యెన్ఐటిటిటిఆర్ సిబ్బంది, మిట్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, యెన్పీటీఈఎల్ కో ఆర్డినేటర్ డాక్టర్ అరుళ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-మదనపల్లి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థి సహా తండ్రి కుమారుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బి కొత్తకోటలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... పేటీఎం మండలం బోర్లపల్లి కి చెందిన శంకర కుమారుడు అజయ్ కుమార్ 18 బి కొత్తకోటలో ఎగ్జామ్ రాయడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. బైకు మార్గమధ్యంలోని జనుపుపల్లి క్రాస్ వద్దకు రాగానే జనుపుపల్లి కి చెందిన తండ్రి కుమారుడు నాగరాజా 54 చక్రధర్ 16లబైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుతో పాటు తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని ముగ్గురిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు వారికి ప్రథమ చికిత్సలు అందించి నాగరాజు చక్రిధర్ పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే తిరుపతికి వెళ్లాలని డాక్టర్లు సూచించారు. అజయ్ కుమార్ మదనపల్లి జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఘటనపై బీ కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఎర్ర చెరువు కబ్జా చేశారంటూ ధర్నా

విశాలాంధ్ర-రామసముద్రం: ఎర్ర చెరువు కబ్జా చేశారంటూ బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మండలం లోని పన మన రెడ్డిపల్లి మూగయరపల్లి గ్రామ స్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పనమరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రామలింగారెడ్డి కుమారుడు రెడ్డప్ప రెడ్డి ఎర్ర చెరువును కబ్జా చేశారని ఆరోపించారు. 221/8 సర్వే నెంబర్ లో ఆరు ఎకరాల విస్తీర్ణం చెరువు కలిగి ఉందని పేర్కొన్నారు. జెసిబి సహాయంతో ఇప్పటికే చెరువు కట్టను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జా చేసిన చెరువులో సపోటా మామిడి చెట్లను పెంచుకొని ఫలసాయం సైతం అనుభవించు కుంటున్నాడని తెలిపారు. తహశీల్దార్ విశ్వేశ్వర శాస్త్రికి వినతిపత్రం అందించి కబ్జా కోరల నుండి చెరువును రక్షించాలని కోరారు. మండల స్థాయి రెవెన్యూ అధికారులు తక్షణ స్పందించి చెరువు స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో వెంకటరమణ, వెంకటరెడ్డి, లక్ష్మన్న ,రమణ, ముదుగురు వెంకటప్ప, రమణ, రెడ్డప్ప, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-చిట్వేలి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థు లకు రాబోవు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగోలి పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులు తమ సృజనాత్మకత నైపుణ్యాన్ని ఉపయోగించి ఆకర్షణీయమైన ముగ్గులు వాటికి అందమైన రంగులు దిద్ది అందరిని ఆకర్షింప చేశారు. అదేవిధంగా విద్యార్థులకు గాలిపటాలు ఎగురవేసే పోటీలు కూడా నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సంక్రాంతి అనేది భారతదేశం లో జరుపుకునే ముఖ్యమైన పండుగన్నారు. అజీవశాస్త్ర విశ్రాంత ఉపాధ్యాయులు, నరసరామయ్య మాట్లాడుతూ పండుగలు వాటి ఆచారాలు సాంప్రదాయాలు పూర్వీకులు మనకు ఇచ్చిన ఆస్థులని, నేటి తరం విద్యార్థులు వాటి గురించి తెలుసుకోవాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలుగు ఉపాధ్యాయిని విజయలక్ష్మి సంక్రాంతి పండుగ నేపథ్యము గురించి, విద్యార్థులకు తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ రెడ్డమ్మ ఉపాధ్యాయులకు విద్యార్థులందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చివరిగా రంగోలి పోటీలలో నిలిచిన ముగ్గురి విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. మొదటి బహుమతి బిందు తొమ్మిదవ తరగతి, ద్వితీయ బహుమతి సుస్మిత మరియు తృతీయ బహుమతి కవిత గెలుపొందడం జరిగింది. గాలిపటాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కూడా బహుమతి అందజేశారు. మొదటి బహుమతి బాల మురళి మరియు శ్రీకర్ రెడ్డి, ద్వితీయ బహుమతి, ముజాహిద్ మరియు రిహాన్, అలాగే తృతీయ బహుమతి ఫర్హాన్ - రెహమాన్ లకు ఇవ్వడం జరిగింది. ముగ్గుల పోటీలో కన్సోలేషన్ బహుమతి సాయి ప్రతాప్, గాలి పటాల పోటీలలో ఈశ్వర్ రాజులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ బహుమతులను ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ దేవ ప్రసాద్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బి. దుర్గరాజులు స్పాన్సర్ చేశారు.

అప్రమత్తత తోనే రోడ్డు ప్రమాదాల నివారణ

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కేశప్ప .రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా మదనపల్లి పట్టణం సమీపంలోని విశ్వం డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. జీవితం చాలా విలువైనదని విద్యార్థిని విద్యార్థులు తమ ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని.రహదారి నియమాలు పాటించాలని కళాశాల యాజమాన్యాలు కూడా నో హెల్మెట్ నో ఎంట్రీ అనే విధానాన్ని ప్రవేశపెట్టాలని.ఎవరైనా రహదారి భద్రత నియమాలు ఉల్లంఘిస్తే కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరిం చారు.అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేయనున్నామని ఆయన తెలియజేశారు.కళాశాలలో ఎవరైనా ఆకతాయిలు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన.ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు తప్పవని.తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని విద్యార్థిని విద్యార్థులు బాధ్యతతో బాగా చదువుకొని కళాశాలకు మంచి పేరు తేవాలని.లోన్ ఆప్స్ , సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని. వీలయి నంతవరకు మీ తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి బాధ్యతాయుతంగా లోన్ ఆప్స్, సైబర్ క్రైమ్ గురించి జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సుమారు2వేల కు పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సమావేశం లో విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం ప్రభాకర్ రెడ్డి, మదనపల్లి తాలూకా సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మదనపల్లి వన్ టౌన్ ఎస్సై వన్ టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్, టూటౌన్ ఎస్సై జి చంద్రమోహన్, ప్రకృతి వనం ప్రసాద్ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి , అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శాశ్వత జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతల

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పంచాయతీ కార్యాలయం పై బుధవారం ఉదయం 100 అడుగుల ఎత్తు గల జాతీయ జెండాను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిచేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ప్రజలందరూ జాతీయ జెండాకు సెల్యూట్ చేసి జాతీయ గీతం ఆలపిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 100 అడుగుల ఎత్తు గల జాతీయ జెండా అన్నమయ్య జిల్లాకే తలమానికం అని అన్నారు. ఇంతటి బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ భాషను అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ హబీబ్ భాషా, జడ్పిటిసి ఏటి రత్న శేఖర్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, వైస్ ఎంపీపీలు హరిత వెంకటరమణ, ఎన్ వి చలపతి, మాజీ ఎంపీపీ మహిత, మాజీ సర్పంచ్ ఏఎస్ హుమయున్, కే.ఎస్ అగామోహిద్దీన్, జిల్లా ఏపీ టూరిజం కౌన్సిల్ సభ్యుడు షేక్ షాకీర్, నియోజకవర్గ మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీం, వైఎస్ఆర్సిపి నాయకులు డివి రమణ అలియాస్ పెద్దోడు, సుంకర చక్రధర్, మునీర్, షబ్బీర్, ఇంతియాజ్ వార్డు సభ్యులు,అబిద్ పంచాయితీ కార్మికులు, ఈవో ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న 216 వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్థానిక వడ్డే ఓబన్న సర్కిల్ (గున్నికుంట క్రాస్) లో వడ్డే ఓబన్న 216 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వడ్డెర విద్యా వంతుల రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం సర్పంచ్ పి.వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యా లవాడ నరసింహారెడ్డి ముఖ్య అనుచరు డైన వడ్డే ఓబన్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విధించే శిస్తులకు వ్యతి రేకంగా గెరిల్లా పోరాటంచేసి తెల్ల దొరలను ముప్పుతిప్పలుపెట్టాడని, చివరిశ్వాసవరకు బ్రిటిష్ ప్రభు త్వంతో పోరాడి యుద్ధవీరునిగా, భరతమాత ముద్దుబిడ్డగా, దేశ చరిత్రలో వేగుచుక్కలా నిలిచి పోయాడని అన్నారు.ఇంతటి యోధుడు వడ్డెర జాతిలో పుట్టడం వడ్డెరజాతికే గర్వకారణమనచనారు రాయచోటిలో వడ్డే ఓబన్న విగ్రహా న్ని అందరిసహకారంతో ఏర్పాటు చేయడానికి గట్టి ప్రయత్నం జరుగు తోందని త్వరలో విగ్రహకమిటీ వివరాలు తెలియజేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బి.జె.పి ఒ.బి.సి మోర్చా జిల్లా అధ్య క్షుడు రేపన.శివప్రసాద్ ఎ.పి.బి.సి. అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డి.నాగముని,అడ్వకేట్ మరియు ఎ.పి వడ్డెర సాధికారసమితి మెం బర్ పి.నాగార్జున రేపన.రాంప్రసాద్ బత్తుల.రఘుపతి రజకసంఘం నాయకుడు రమేష్ రేపన.రమణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగన్ ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : జగన్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని రాయచోటి వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట గ్రామంలో కొత్తవడ్డేపల్లె, సి వడ్డెపల్లె, కొండావాండ్లపల్లె, కొనసాని వాండ్లపల్లె, ఎర్రప్పగారిపల్లె, కాలాడి వాండ్లపల్లె లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. గడప గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. విప్లవాత్మక మార్పులుతో, వ్యవస్థలలో మార్పులు తెచ్చి ప్రజల వద్దకే పాలనను తెచ్చారన్నారు. సీఎం జగన్ పాలన ఆదర్శంగా, పారదర్శకంగా సాగుతోందన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం..: ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సమస్యలుపై ఆయన ప్రజలుతో మనేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అవ్వా బాగున్నారా...అక్కా సంక్షేమ పథకాలు అందు తున్నాయా అంటూ ఆప్యాయంగా పలకరించారు.కె వడ్డెపల్లె లో కల్వర్టు ఏర్పాటు చేయిస్తామని హామీ యిచ్చారు.కొండావాండ్లపల్లెలో కోదండరామిరెడ్డి అనే వ్యక్తి గత పదేళ్ల క్రితం తనకు రాయచోటి మాసాపేట వద్ద రోడ్డు ప్రమాదం జరిగితే స్వయంగా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు అంటూ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చెరువు ముందర వడ్డేపల్లెలో త్రాగునీటి బోరు కు అదనపు విద్యుత్ లై న్ ఏర్పాటుచేసి త్రీ ఫేస్ సప్లై ఇవ్వాలని, త్రాగునీటి బోరు కు మరమ్మత్తులు చేయాలని ఆదేదించారు. ఎర్రప్పగారిపల్లెలో నూతన బోరు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఎర్రప్పగారిపల్లెకు చెందిన నలుగురు రైతుల భూములలో వెళ్లిన కాలువకు భూ పరిహారం అందించాలని శ్రీకాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఎంఎల్ఏ స్పందించి త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పథకాలు ఆదుకుంటున్నాయి: ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు తమను ఆదుకుంటున్నాయంటూ కొనంపేట గ్రామస్తులు శ్రీకాంత్ రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వంలో నాయకుల సిపారసుతోనూ, జన్మభూమి కమిటీలతో పథకాలు అందేవని, ఇప్పుడు ఎవ్వరి సిపారసు లేకుండానే, అర్హత ఉంటే ఇళ్ల దగ్గరకే పథకాలును సీఎం జగన్ గారు పంపిస్తున్నారంటూ వారు హర్షం వ్యక్తం చేశారు.ప్రతి ఇంటికీ రెండూ, మూడూ పథకాలు అందాయని,మహిళలకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ,కాపునేస్తం, నేతన్న నేస్తం తదితర పథకాలు తమ జీవితాలలో వెలుగులు నింపాయంటూ అక్క చెల్లెమ్మలు శ్రీకాంత్ రెడ్డి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు.

కె వడ్డెపల్లె లో కోటకొండ పెద్దరమణ కుటుంబానికి రూ 5,55,597 లబ్ధి: కె వడ్డెపల్లెకు చెందిన కోటకొండ పెద్ద రమణ కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా మూడేళ్ళలో రూ597 5,55 లబ్ది చేకూరింది.పింఛన్ కానుక క్రింద రూ2.20 లక్షలు, జగనన్న అమ్మఒడి ద్వారా రూ 42 వేలు, రైతు భరోసా రూ 44,500, ఆసరా రూ 19,780, ఇన్ ఫుట్ సబ్సిడీ రూ 9 వేలు, జగనన్న వసతి

దీవెన రూ 10 వేలు,విద్యాదీవెన ద్వారా రూ 9300 లబ్ధి పొందడంపై ఆ కుటుంభం ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గడప గడపనా నీరాజనం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి గడప గడప నా ప్రజలు నీరాజనాలు పలికారు.మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి,మాజీ ఎంపీపి అంబాబత్తిన రెడ్డయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, తాసిల్దార్ నాగప్రసన్నలక్ష్మి, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, ఏ పి ఎస్ పి డి సి ఎల్ ఏఈ కిషోర్, మాజీ సర్పంచ్ కొండ ప్రసాద్ రెడ్డి, వైయస్సార్సీపి నాయకులు నాగముని రెడ్డి, బలరాం రెడ్డి, గజేంద్రారెడ్డి, అంబాబత్తిన రమేష్, అలి భాష,రాఘవ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి,పురుషోత్తం, రామయ్య,మాసుల్ సాబ్,శివమళ్ళప్ప నాయుడు, ఆంజనేయులు నాయుడు, జమాల్ భాష, బండ్రేడ్డి శంకర్ రెడ్డి, మల్ రెడ్డి, గోపాల్ రెడ్డి,రఘునాథ రెడ్డి,ఖాదర్ వలీ,బొంబాయి, ఫయాజ్, ప్రభాకర్, రామక్రిష్ణ,కార్తిక్,గంగిరెడ్డి, సంతోష్,కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ,శంకర్ నాయుడు,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, వెలుగు ఏపిఎం నిరంజన్, హౌసింగ్ ఏఈ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, వైయస్సార్సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కె.వి పల్లి: గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏ.పి.జి.వై.ఎస్.ఎస్ అనుబంధ సంస్థ వెన్నెల కంటి రాఘవయ్య గిరిజన యానాదుల ఆశయ సాధన సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాలి ఇజ్రాయేలు అన్నారు. బుధవారం స్థానిక మండలం గోరంట్లపల్లి గ్రామం, కంబిరెడ్డిగారిపల్లి ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఇప్పుడు అనేక కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి గిరిజన యానాదులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం బోయ ,వాల్మీకి,ఒరియా,బెంతు, కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి ,మూడు నెలల లోగా నివేదిక ప్రభుత్వానికి అందించాలని ప్రకటించింది. దీని కొరకు జీవో నెంబర్ : 52 ప్రభుత్వం తీసుకురావడం జరిగింది, అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనుల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని వారికి అభివృద్ధివైపు నడిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు, అలాగే రాజ్యాంగం అధికరణం 342 ప్రకారం ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చ రాదని, దీని పై కమిషన్లు ఏర్పాటు చేయరాదని, 5 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో తీర్మానించడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన దేశంలోని దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న గిరిజనులు ఇంకా దీన స్థితికి చేరుకోవడమే కాక ,రాష్ట్రంలో ఉన్న 35 గిరిజన తెగలు అంతరించి పోయే ప్రమాదం ఉందని అన్నారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజన యానాది నాయకులు ఇటీవల అనారోగ్యానికి గురి అయిన గిరిజన యానాది రాష్ట్ర నాయకుడు పులి శ్రీనివాసులను కంబిరెడ్డిగారిపల్లి ఎస్టీ కాలనీలో తన స్వగృహంలో పరామర్శించారు. పై కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సంఘ రాష్ట్ర కోశాధికారి టేకుమంద రెడ్డప్ప, గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, గానుగపెంట సిద్దయ్య, వెన్నెలకంటి రాఘవయ్య గిరిజన యానాదుల ఆశయ సాధన కమిటీ నాయ కులు చేవూరి రామలింగయ్య, తుపాకుల పోలయ్య, వేటగిరి సంజీవరావు, ఏ కుల చెన్నకేశవులు, యానాది మహానాడు నాయకుడు ఈగ వెంకటేశ్వర్లు, గిరిజన యానాది మహిళా సభ్యురాలు రాచూరి గౌరీ పాల్గొన్నారు.

సమస్యలను ప్రశ్నిస్తే ముస్లిం మహిళలపై వైసీపీ నాయకుల దాడి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:గడప గడప ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక సమస్యలు, పెన్షన్లపై ప్రశ్నించినందుకు ఫాతిమా రమీజాపై కళ్ళల్లో కారం చెల్లి , ఇనుపరాళ్ళతో వైసిపి నాయకులు దాడి చేయడం క్రూరమైన బ్రిటిష్ పరిపాలన లిసాగిస్తున్నారని గాజుల ఖాదర్ భాష తీవ్రంగా దుయ్యబట్టారు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయనవిలేకరుల సమావేశంలో మాట్లాడు తూ ముస్లింల ఓట్లతో గద్దెనెక్కి ఈరోజు ముస్లింలు అన్ని విధాలుగా అన్యాయానికి దౌర్జన్యానికి గురౌతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన దగ్గర నుండి మైనార్టీల పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే ముస్లిం మైనారిటీలపై దాడులు దౌర్జన్యాలు అధికమయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులు దౌర్జన్యాల పరంపర ఆఖరికి విజయవాడకి చెందిన ఒంటరి ముస్లిం మహిళలు అయిన ఫాతిమా, రమీజా, పెన్షన్ కోసం అని దేవినేని అవినాష్ ను ప్రశ్నిస్తే మరుసటి దినం ఉదయమున 25 మంది వైసీపీ గుండాలు ఇంటి దగ్గరకు వచ్చిమహిళల ఇంట్లో దూరి దాడులకు. పాల్పడడం అత్యంత దారుణమైన విషయం అన్నారు. అధికార పార్టీ నాయకుల తీరు వారి రాజకీయ సమాధి కొద్ది దూరంలోనే ఉందన్నారు. ముస్లిం మైనారిటీల ఆత్మగౌరవాన్ని ఆత్మాభిమానాన్ని కించపరిచిన దేవినేని అవినాష్, మరియు స్థానిక కార్పొరేట్ రామి రెడ్డి బేషరతుగా కేవలం ఫాతిమా మరియు రమీజాలకు మాత్రమే కాదు యావత్తు ముస్లిం సమాజానికి, యావత్తు మహిళ లోకానికి క్షమాపణ కోరాలి అని గాజుల ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. రమీజాబీ ఫాతిమా మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేసేందుకు వెళితే కృష్ణలంక సీఐ దుర్గారావు వాడిన భాష యూజ్లెస్ ఫెలోస్ అని పదజాలాలు వాడటం బట్టి చూస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పోలీస్ స్టేషన్ లకు వైసిపి సెక్షన్ల పైన ఎలా తర్ఫీదు ఇస్తున్నారు అన్న విషయం స్పష్టంగా కనబడుతుందన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - మైదుకూరు : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రియేటివ్ డ్రాయింగ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ %ఇ%ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల క్రిష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల పైన ఆధారపడి ఉందని, పిల్లలందరూ శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థి దశనుండి కష్టపడి పిల్లలందరూ అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. కేర్ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ యాసిన్ ట్రస్ట్ సభ్యులు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగస్వాములు కావడం పట్ల వారిని అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్రమ్మ మాట్లాడుతూ మా విద్యార్థులకు కేర్ క్లబ్ ఫౌండేషన్ వారు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఓబులేసు గారు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు మంచిదని వాటికి తోడ్పాటు అందించిన ట్రస్టు సభ్యులను అభినందించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల కృష్ణ చేతుల మీదుగా మెడల్, ట్రోఫీ,సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నారాయణమ్మ, విద్యార్థిని విద్యార్థులు, ట్రస్టు సభ్యులు శివ,కొండయ్య,సందీప్, వెంకటేష్, గౌస్,బ్రహ్మేంద్ర లు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన రమేష్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం క్యాలెండర్ ను బుధవారం రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి తన స్వగృహంలో రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగారెడ్డి జిల్లా పాడి రైతు రైతు సంఘం రాయచోటి కార్యదర్శి కొనసాని రాజారెడ్డి రాయచోటి రైతు సంఘం వెంకట్రామరాజు కార్యదర్శి రమణ మదన రామకృష్ణ గౌడ్ చాంద్ బాషా రాయచోటి మండల క్లస్టర్ ఇన్చార్జి ఎంవి రమణారెడ్డి వెంకటరామిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రమణారెడ్డి ఆగ్రో వీరనాగిరెడ్డి చుక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో సంక్రాంతి పండగ పురస్కరించుకొని ఉపాధ్యాయులు విద్యార్థులు ముందస్తు సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే సంబరాలు భోగిమంటలు కోలాటం సంక్రాంతి నాటకాలు నాట్య ప్రదర్శనలు నిర్వహించారు ప్రిన్సిపల్ రేఖ విద్యార్థులకు సంక్రాంతి గురించి వివరించారు. తరతరాలుగా తెలుగువారు జరుపుకునే సంక్రాంతి పండగ రాష్ట్రమంతా అత్యంత వైభవంగా ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి సంబరాలు జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, రాజకుమార్ శివ శంకర్ రెడ్డి ,జమ్ముద్వేగం శ్రీనివాసులు, సుజాత ,శ్రీకళ ,విజయ కుమారి విజయ, సుధాకర్ ఉపాధ్యాయులు ప్రసాద్ ఆఫీసా, సుమియా అరుణకుమారి ,భారతి, మురళి నాయక్, ఉమామహేశ్వరి, సుధీర్ కుమార్, రసూల్, సోమశేఖర్ నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు నుంచి దువ్వూరుకు పాదయాత్రతో రైతు నిరసన

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు నుంచి దువ్వూరు తహసిల్దార్ కార్యాలయం వరకు కుటుంబ సభ్యులతో కాలినడకన వెళ్లి రైతు నిరసన తెలిపిన ఘటన బుధవారం జరిగింది.దువ్వూరు మండల పరిధిలోని సి. భైనపల్లి వద్ద సర్వే నెం. 1396/2లో 78 సెంట్ల భూమి ఉందని.. దీన్ని ఎమ్మెల్యే అండదండలతో వైసీపీ నాయకులు శంకర్ రెడ్డి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సంగటి తిమ్మాయపల్లెకు చెందిన రైతు వెంగముని తెలిపారు. దీంతో తనకు ఆత్మహత్యే శరణ్యం అంటూ రైతు పాదయాత్ర చేపట్టారు.

దళిత ద్రోహి ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు తెదేపా కార్యాలయంలో బుధవారం తెదేపా యసి సెల్ విభాగం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావాలి నియోజకవర్గంలో దళితులపై వరుసగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ నిన్నటి రోజున యసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు యమ్ ఎస్ రాజు చలో కావాలి కార్యక్రమం చేపట్టారు.దాన్ని భగ్నం చేసి పోలీసులు అక్రమ అరెస్ట్ చేయడాన్ని మైదుకూరు తెలుగుదేశం తీవ్రంగా ఖండిస్తుంది. అరెస్ట్ చేసి యమ్ యస్ రాజును ఏమి,చేద్దామనుకుంటున్నారు.ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. దళితులకు అన్యాయం జరుగుతోంటే వారికి అండగా నిలబడ్డం రాజు చేసిన తప్పా తక్షణం యమ్.యస్ రాజు ను మీడియా ముందు హాజరుపరచాలి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి నాటి నుండి దళితులపైన దన, మాన,ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని తీవ్రంగా విమర్శించారు. చీరాలలో వైసీపీ నాయకుల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నాడనే నెపముతో వరప్రసాద్ అనే యువకుని స్టేషన్ లోనే శిరోముండనం చేసారని,మాస్క్ పెట్టుకోలేదని పోలిసులు కొట్టిచంపారని అలాగే మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపేసారని మాజీ ఎంపీ హర్షకుమార్ అక్రమ కేసులతో వేదించారని,మదనపల్లి దళిత జడ్జి రామకృష్ణ పై వైసీపీనాయకులు హత్యాయత్నం చేసారని వాపోయారు. కావున దళితులు అందరూ రాజకీయంగా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో యసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు,మైనారిటీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.

కన్యకా చెరువు కాలువలు అభివృద్ధికి కృషి.: ఎంపీపీ

విశాలాంధ్ర-నందలూరు : కన్యకా చెరువు తోపాటు కాలువల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ మేడ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైకాపా నాయకులతో కలిసి కన్యగా చేరువు కాలువలను పరిశీలించారు. కన్యకా చెరువు సమీపంలోని కట్టపై అనేకమంది పేదల జీవిస్తున్నారని సమీపంలోని ఖాళీ ప్రదేశంలో నందలూరు కు చెందిన మత్స్యకారులకు వారి అభివృద్ధి కోసం చెరువులో పట్టిన చేపలను శుభ్రం చేసుకునేందుకు తాత్కాలిక షెడ్డు ను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించడం జరిగిందన్నారు. చాలాకాలంగా వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. కన్యకా చెఱువు ప్రధాన కాలువ ఆక్రమణకు గురైందని దీంతో చెయ్యేరు నది నుండి నీటికి ఇబ్బందులు ఎదురవు తున్నాయన్నారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు అయిందని ఆ నిధులతో ప్రధాన కాలవను అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు. మాది పేదల ప్రభుత్వమని పేదలకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ . కోఆప్షన్ సభ్యులు కలిమ్ గ్రామ కార్యదర్శి ప్రసాద్ వైకాపా నాయకులు ముమ్మడి మదన్ మోహన్ రెడ్డి పెనుబాల నాగ సుబ్బయ్య హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి అరాచక పాలన:టిడిపి

విశాలాంధ్ర-రామాపురం: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి అవినీతి, అరాచక, నియం తృత్వ, అక్రమ పాలనను సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దింపుదాం అని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠరావు పేటలో బుధవారం ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత టిడిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు అందేటటువంటి దుల్హన్ పథకం,రంజాన్ తోఫా,మసీదుల్లో పనిచేస్తే మౌజమ్ లకు జీతాలు ఇవ్వడం తదితర పథకాలను లేకుండా చేశారని ఆరోపించారు.ఈ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.మహిళల పరిస్థితి అయితే మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతినిత్యం సామాన్యుల జీవింతాలతో చెలగాట మాడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచేందుకు ప్రజలంతా సైనికుల్లా ముందుకు కదలాలని ఆయన పిలుపునిచ్చారు. రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఇదేమీ కర్మ కార్యక్రమంలో భాగంగా నీలకంఠరావుపేట గ్రామానికి చెందిన ముస్లింలు 10 కుటుంబాలు ఆర్ రమేష్ కుమార్ రెడ్డి. సమక్షంలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముస్లింలకు ఎలాంటి పథకాలు లేక అభివృద్ధి ఎక్కడ జరగలేదని ఈ ప్రభుత్వంలో అరాచకాలు ఉన్నాయని ముసిములపై ఎలాంటి పథకాలు అందక తమకు న్యాయం జరగలేదని ఈ విషయంపై టిడిపి ప్రభుత్వం వస్తే తమకు అన్ని రకాలుగా అభివృద్ధి జరుగుతుందని తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఇలాంటి అరాచక పాలన ఇంతవరకు మేము చూడలేదని బ్రిటిష్ పాలన ను జగన్మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ రమేష్ రెడ్డి, టిడిపి మండల మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా గడి కోట భాస్కర్ రెడ్డి, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి ,రవి శంకర్ రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షులు దివ్య కుమార్ రెడ్డి, నాగభూషన్ రెడ్డి, చెన్నూరు బాబు నజీర్, షేక్ నియాజ్. సయ్యద్ ఫిర్,సాదక్, నరేంద్ర కుమార్ రెడ్డి. ఇసాక్, భాషపల్లి, సలామ్, జాబిల,అసఫక్,ఈర్షద్, క్రిష్ణాయ్య, పెంచల్ రెడ్డి, రామక్రిష్ణ గౌడ్,వెంకట్రామిరెడ్డి, వెంకటశివయ్య వెంకట్రామిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

ఆవులు పొలంలోకి వచ్చాయని అడిగిన మహిళపై కత్తితో దాడి

విశాలాంధ్ర-మదనపల్లి :ఆవులు పొలంలోకి వచ్చాయని ప్రశ్నించిన మహిళపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మన పల్లి మండలంలో జరిగింది. పోలీసుల కథనం.. నిమ్మనపల్లి మండలం, ముస్టూరు పంచాయతీ, పారేసువారిపల్లికి చెందిన నరసింహులు భార్య శారద పొలంలోకి మంగళవారం అడవికి మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గ్రామంలోని పాడి పశువులు పొలములోకి వచ్చాయి. పశువులు రావడంతో పశువుల కాపరులను శారద మందలించి దూషించింది. చీకటి పడ్డాక ఇంటికి వచ్చి పల్లెలో దూషిస్తున్నడంతో ఆగ్రహించిన ప్రత్యర్థి అదే గ్రామంలోని అంజి భార్య నరసమ్మ వేట కొడవలితో శారదపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. దాడిలో గాయపడిన బాధితురాలని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారంతో నిమనపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి: ఛైర్మన్

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: సంక్రాంతి పండుగ సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక అని పెరెంట్స్ కమిటి ఛైర్మన్ పల్లా దామోదర్ పెర్కొన్నారు.బుధవారం గవర్నమెంట్ హైస్కూల్ లో జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సంద ర్భంగా దాము మాట్లాడుతూ మహిళలలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు.ముగ్గుల పోటీలలో గెలిచిన విజేలకు వెండి వస్తువులు అందజేసి అభినం దించామన్నారు. బోగి మంటలు వేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు.విద్యార్థులు వేసిన వేష ధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.పాఠశాల అవర ణాన్ని అందంగా ముస్తాబు చేసి సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. బోగిమంటల పాటలకు,భజన కీర్తనలకు విద్యార్థులు నృత్యాలు వేసి పలువురిని ఆనందింపచేశారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు వెపరాల ఎబినె జర్, బైయాలజీ టీచర్ శశికళ, ప్రధానోపాధ్యాయులు చంగల్ రెడ్డి, అభి నందిం చారు.ఉపాద్యాయ బృందం, విధ్యార్దిని, విద్యార్థులు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.